
సాక్షి
ఒడిశా
శనివారం । 29 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,57,458లు, బంగారం 46.4 గ్రాములు, వెండి 28.9 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



స్వరాష్ట్రానికి సూడాన్ బాధితులు -IIలో



సరిహద్దులో కూబింగ్ ముమ్మరం -IIలో

న్యూస్‌రీల్

మహిళ కమిషన్‌కు కొత్త సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్ర మహిళ కమిషన్‌కు ప్రభుత్వం కొత్త సభ్యులను నియమించింది. శుక్రవారం జారీ అయిన ఉత్తర్వుల ప్రకారం స్వర్ణలత సామల్, సుజాత దిగ్గల్, విజయ బర్వా, స్వాగతిక మహంతి, బబిత స్వాయి, బిచిత స్వాయి సభ్యులుగా నియమితులయ్యారు. వీరిలో బిచిత రాష్ట్ర మహిళ–శిశు అభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి హోదాలో అధికారిక సభ్యురాలిగా వ్యవహరిస్తారని ఉత్తర్వులు పేర్కొన్నాయి.

పద్మపూర్ శివాలయంలో చోరీ



అపహరణకు గురైన శివాలయం

రాయగడ: జిల్లాలోని పద్మపూర్‌లో ఉన్న ధవలేశ్వర శివాలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. మందిరంలోని దక్షిణం వైపు ఉన్న తలుపులను విరగ్గొట్టిన దుండగులు.. లోపలికి చొరబడ్డారు. దీనిపై పద్మపూర్ పోలీస్ స్టేషన్‌లో మందిరం అర్చకుడు మధు రోణ శుక్రవారం ఉదయం ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు తరహాలోనే పూజా కార్యక్రమాలు నిర్వహించుకుని గురువారం రాత్రి అర్చకుడు మందిరాన్ని మూసివేశారు. శుక్రవారం తెల్లవారు యథావిధిగా పూజా కార్యక్రమాల కోసం మందిరానికి వెళ్లి చూడగా మందిరం గర్భగుడి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గర్భాలయంలోని శివలింగానికి వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొరాపుట్ పార్లమెంటరీ అభివృద్ధికి రూ.302 కోట్లు



ఎంపీ సప్తగిరి ఉలక

రాయగడ: కొరాపుట్ పార్లమెంటరీ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి కేంద్ర ఆరోగ్యశాఖ ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకం కింద సుమారు రూ.302 కోట్ల నిధులు సమకూర్చేందుకు ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు నియోజకవర్గ ఎంపీ సప్తగిరి ఉలక శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. తన నియోజకవర్గంలో ప్రధానంగా ప్రజారోగ్య భద్రత మెరుగు పరచడంతో పాటు క్రిటికల్ కేర్ హాస్పటల్ బ్లాక్(సీసీబీ) ల ఏర్పాటుకు ఈ నిధులు వినియోగించనున్నట్లు ఆయన వివరించారు.

జయపురంలో యువకుడి బలవన్మరణం

జయపురం: పట్టణంలోని బలిపేట వీధిలో ఓ యువకుడు గురవారం సాయంత్రం ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడు దుర్గాప్రసాద్ పాణిగ్రహి(28)గా పోలీసులు వెల్లడించారు. ఇంట్లో ఉరి వేసుకొని ఉన్న ప్రసాద్‌ను చూసిన కుటుంబ సభ్యులు వెంటనే జయపురం పట్టణ పోలీసులకు తెలియజేశారు. ఏఎస్‌ఐ విజయ పట్నాయక్ ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం శుక్రవారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దుర్గాప్రసాద్ ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.

జీ-20 సదస్సులో రాయగడ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రాయగడ: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఈనెల 22నుంచి 5రోజులు జరిగిన అంతర్జాతీయ జీ–20 సమావేశాల్లో రాయగడ అటానమస్ కళాశాలకు చెందిన ఏ.జ్యోత్స్న, శుభశ్రీ స్వాయి, ప్రియాంశు ఆచార్య, రాజశేఖర్ బెహరా పాల్గొన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు, వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. జిల్లా నుంచి విద్యార్థులు ప్రాతినిధ్యం వహించి, సమావేశాలు ముగిసిన సందర్భంగా తిరిగి రాయగడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీకే గంతాయిత్ తదితరులు కళాశాలలో శుక్రవారం నాడు అభినందించారు.



బరంపురం: గాంధీనగర్‌లో దాస్ జయంతి ఉత్సవాల్లో నగర ప్రముఖులు



జయపురం: పాఠశాలలో మధుబాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



రాయగడ: దాస్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి సరక, ఎమ్మెల్యే



జయపురం:సెమినార్‌లో పాల్గొన్న న్యాయవాదులు, న్యాయాధికారులు

రతనాల బిడ్డకు.. భారతరత్న ఇవ్వాలి



భువనేశ్వర్: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ గణేషీలాల్

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా మధుసూదన్ దాస్ జయంతి కార్యక్రమాలు
- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘాల సభ్యులు
- భారతరత్న ప్రకటించాలని ఆకాంక్షించిన గవర్నర్ గణేషీలాల్

జయపురం: ఉత్కళ గౌరవ్, ఒడిశా ప్రథమ న్యాయవాది, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ప్రధాన పాత్ర నిర్వహించిన మహానేత మధుసూదన దాస్ అని వక్తలు కొనియాడారు. ఆయనకు భారతరత్న ప్రకటించాలని గవర్నర్ గణేషీలాల్ అభిప్రాయం వ్యక్తంచేశారు. దాస్ జయంతి కార్యక్రమాలను శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయపురం బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలోని మధుబాబు విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ పేదల పెన్నిధిగా, రాజకీయ నేతగా, రచయితగా, న్యాయవాదిగా సమాజానికి ఎన్నో సేవలందించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ న్యాయసూత్రాలపై సెమినార్ నిర్వహించారు. సమావేశంలో న్యాయవాదులు, న్యాయాధికారులు ప్రజ్ఞా బెవర్తా, శోశానంద మిశ్రా, టి.నారాయణమూర్తి, డాక్టర్ నిరంజన్ మిశ్రా, లాల్‌మోహన మిశ్రా, ధర్మేంద్రకుమార్ జెనా, సునీల్‌కుమార్ మహంతి, దేవాశిశ్ మహంతి, భీరేష్ పట్నాయక్, ఆరతి మహంతి, చందన నాయక్, పుష్పాంజలి సాహు, అంబిక ఖొరా, సహదేవ్ పట్నాయక్, ఆశా పట్నాయక్, డాక్టర్ గాయిత్రీ దేవి తదితరులు పాల్గొన్నారు. జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధుబాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రద్ధాంజలి ఘటించారు.

రాష్ట్రపతికి సిఫార్సు..

భువనేశ్వర్: 'ఉత్కళ గౌరవ్‌గా ప్రాచుర్యం పొందిన మధుసూదన్ దాస్ ఉత్కళ జనని రతనాల బిడ్డ. ఆయనకు భారరత్న ప్రదానం కావాల'ని ఆకాంక్షిస్తున్నట్లు గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ తెలిపారు. మధుసూదన్ దాస్ జయంతి సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. కటక్ నగరం సరళా భవన్‌లో జరిగిన కటక్ జిల్లా ఉత్కళ సమ్మేళని నిర్వహించిన మధు జయంతి సభలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఖండపడా ఎమ్మెల్యే సౌమ్యరంజన్ పట్నాయక్, కటక్ బరాబటి ఎమ్మెల్యే మహ్మద్ మొకీమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కటక్ గోరక్ బజార్ మధుబాబు సమాధి వద్ద జిల్లా కలెక్టర్ భవానీ శంకర్ చొయిని ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్ ఆధ్వర్యంలో మధుసూదన్ దాస్‌కు భారతరత్న గౌరవ ప్రదానం చేయాలని కోరుతూ భారత రాష్ట్రపతికి అభ్యర్థన పత్రాలు సిఫార్సు చేయించాలని సభలో తీర్మానించారు.

సమృద్ధ ఒడిశా నిర్మాత..

'ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్ సమృద్ధ ఒడిశా నిర్మాత. ఒడియా భాషా ఆందోళనతో ఉత్కళ రాష్ట్రం ఆవిర్భావంలో ప్రధాన సూత్రధారి స్వాభిమాన పరిరక్షణ, భాష, సాహిత్య ప్రచారంలో నిర్విరామ యోధుడుగా రాష్ట్రానికి వన్నెదిద్దిన ఘనుడు'గా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కొనియాడారు. మధుబాబు జయంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.



యువతకు ఆదర్శం..

బరంపురం: నేటి యువతరానికి అదర్శ ప్రాయుడిగా స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ మధుసుదన్ దాస్ నిలిచారని సీనియర్ న్యాయవాది కపిలేశ్వర్ పట్నాయక్ పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో గంజాం అసోసియేషన్ ఆధ్వర్యంలో మధుసూదన్ దాస్ జయంతి, ఒడిశా న్యాయవాదుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు దాస్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బార్ ప్రతినిధులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే బరంపురం గాంధీనగర్ మెయిన్ రోడ్డు జంక్షన్‌లో మధుబాబు విగ్రహానికి వివిధ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మొట్టమొదటి న్యాయవాదిగా రాష్ట్రానికి ఎంతో వన్నె తెచ్చారని ప్రశంసించారు.

హాజరైన మంత్రి జగన్నాథ సరక..

రాయగడ: రాయగడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన మధుసూదన్ దాస్ జయంతి కార్యక్రమానికి రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, ఎమ్మెల్యే మకరంద ముదులి హాజరయ్యారు. అక్కడి విగ్రహానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దేవిప్రసాద్ పట్నాయక్ పర్యవేక్షించారు. స్థానిక ఉత్కళ గౌరవ్ మధుసూదన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(యూజీఎంఐటీ)లో నిర్వహించిన కార్యక్రమంలో డీఐసీ రీజనల్ కో–ఆర్డినేటర్ సవ్యసాచి సాహు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: మధుసూదన్ దాస్ వ్యక్తిత్వంపై మాట్లాడుతున్న శ్వేతా పట్నాయక్

ఒడియా స్వాభిమాన్..

పర్లాకిమిడి: పండిత మధుసూదన్‌దాస్ జయంతి ఉత్సవాన్ని పట్టణంలోని ఉత్కళ సమాజ్ భవనంలో సాహితీ, భాషా ప్రియులు ఘనంగా నిర్వహించారు. దాస్ కోల్‌కతాలో బెంగాలీలో చదువుకున్నప్పుడు తన మాతృభాష ఒడియాలో పరీక్షలు రాయాలని తపన పడ్డారని ప్రముఖ రచయిత్రి శ్వేతా పట్నాయక్ సభికులకు తెలియజేశారు. ప్రత్యేక రాష్ట్రానికి ఆయన విశేష కృషి చేయడమే కాకుండా 1903లో ఉత్కళ సమ్మేళనానికి పునాదిరాయి వేశారన్నారు. కోస్తా బిచ్చిన్నాంచల్ ప్రహరి, పూర్ణచంద్ర మహాపాత్రొ మాట్లాడుతూ కోల్‌కతాలో ఆయన న్యాయవిద్య అభ్యసించి, తొలి ఒడియా న్యాయవాదిగా కటక్ హైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారని గుర్తుచేశారు. అనంతరం న్యాయవాది బాల పట్నాయక్, అశోక్ పాణిగ్రాహి, ఆశాలతా అమ్మన్న, జాతీయ అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు బినోద్ జెన్నా తదితరులు మాట్లాడారు. ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



బరంపురం: కోర్టు ప్రాంగణంలోని మధుబాబు విగ్రహానికి పూలమాల వేస్తున్న న్యాయాధికారులు



భువనేశ్వర్: ఉత్సవాల వేదికపై నివాళులర్పిస్తున్న గవర్నర్, ప్రముఖులు



పర్లాకిమిడి: జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న వక్తలు



రాయగడ: యూజీఎంఐటీలో మధుబాబు జయంతి వేడుకలు

ప్రాణి చికిత్సకు ప్రణామం



ప్రపంచ పశుసంవర్థక దినోత్సవం పురస్కరించుకుని పూరీ సాగర తీరంలో అంతర్జాతీయ సైకతశిల్పి మానసకుమార్ సాహు శుక్రవారం ఈ సుందర కళాఖండాన్ని తీర్చిదిద్దారు. 7 గంటల పాటు నిరవధికంగా శ్రమించి, 15 టన్నుల ఇసుక వినియోగంతో 15 అడుగుల సువిశాల పశువైద్య శిల్పం ఆవిష్కరించారు. ప్రకృతి వరమైన మూగజీవుల సంరక్షణలో అనుబంధ వైద్యుల పాత్ర అనన్యంగా పేర్కొని, అభినందించారు. పూరీ తీరంలో ఈ శిల్పం సందర్శకులను ఆకట్టుకుంది.

– భువనేశ్వర్

376 కిలోల గంజాయి పట్టివేత



265 కిలోల గంజాయితో పోలీసుల అదుపులో నిందితుడు

- నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

బరంపురం: గంజాం, కొరాపుట్ జిల్లాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన దాడుల్లో 376కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బరంపురం ఎక్సైజ్ ఎస్పీ రమేంద్ర నాయక్‌కు అందిన సమాచారం మేరకు.. కొందమాల్ జిల్లా బల్లిగుడా అటవీ ప్రాంతం నుంచి బంజ్‌నగర్, 56 నంబర్ జాతీయ రహదారి మీదుగా బరంపురం నగరం వైపు గంజాయి రవాణా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు జాతీయ రహదారిలో రెక్కీ నిర్వహించారు. బంజ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా, అటుగా వస్తున్న వాహనంలో 25 బస్తాల్లో 265 కిలోల గంజాయిని గుర్తించారు. సరుకును సీజ్ చేసి, సన్నోఖేముండి బ్లాక్‌కు చెందిన డ్రైవర్ నారాయణ రౌథ్‌ను అరెస్ట్ చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. అలాగే బరంపురం రైల్వేస్టేషన్ నుంచి భువనేశ్వర్‌కు అక్రమంగా తరలిస్తున్న 15కిలోల గంజాయితో పాటు ఓ వ్యక్తిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు గంజాం జిల్లా సురడా గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ నాయక్‌గా ఆర్‌పీఎఫ్ అధికారులు తెలిపారు.

లమతాపుట్‌లో ఇద్దరి అరెస్ట్

జయపురం: కొరాపుట్ జిల్లా లమతాపుట్ సమితి మాచ్‌ఖండ్ పోలీసులు కారులో తరలిస్తున్న గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. కొణగాం కూడలి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అటుగా వస్తున్న కారును తనిఖీ చేయగా, 96.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి రూ.10 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. వీటిని రవాణా చేస్తున్న నిందితులు చంగుడిపొడ గ్రామానికి చెందిన వంశీధర బాగ్, కక్కిరిగుమ్మకు చెందిన రామేశ్వర ఖొరాపై కేసు నమోదు చేశారు.



బరంపురం రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయి



జయపురం: గంజాయితో పట్టుబడిన నిందితులు

ఈమాత్రం చాలవు..



పూరీ రైల్వేస్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

- ఒడిశాకు మరో 2 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కేటాయించాలి
- రైల్వేమంత్రికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి టుకుని సాహు లేఖ

భువనేశ్వర్: రాష్ట్రంలోని ప్రయాణికుల సౌకర్యార్థం మరో రెండు మార్గాల్లో సెమీ హైస్పీడ్ రైళ్లను ప్రవేశ పెట్టాలని రాష్ట్ర వాణిజ్య, రవాణాశాఖ మంత్రి టుకుని సాహు రైల్వేశాఖ మంత్రి అశ్వినికుమార్ వైష్ణవ్‌కు లేఖ రాశారు. ఆర్థిక అభివృద్ధిని పెంచేందుకు రైలు రవాణాను వేగంగా విస్తరించాలని తన లేఖలో పేర్కొన్నారు. వేగవంతమైన కనెక్టివిటీని అందించడానికి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు దేశవ్యాప్తంగా ప్రవేశపెడుతున్న తరుణంలో రాష్ట్రం పట్ల శీతకన్ను వేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల ఆకాంక్షలను తీర్చేందుకు ఒడిశా మీదుగా మరిన్ని రైళ్లను ప్రవేశ పెట్టాలని అభ్యర్థించారు. ప్రయాణికులకు వేగవంతమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు పూరీ–హౌరా మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుతో మరో 2 సర్వీసులు ప్రవేశ పెట్టాలని కోరారు. పశ్చిమ ఒడిశాను రాష్ట్ర రాజధానితో అనుసంధానించే దిశలో అతి తక్కువ వేగవంతమైన రైళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సంబల్‌పూర్ మీదుగా పూరీ–రూర్కెలా మధ్య రైలు సేవలు పశ్చిమ ఒడిశా జిల్లాల నుంచి రాష్ట్ర రాజధానికి అత్యంత వేగవంతమైన సౌకర్యంగా నిలుస్తుందన్నారు. ఇది రాష్ట్ర అంతర్గత ఆర్థిక కార్యకలాపాలను పెంచుతుందని, ఝార్సుగుడ, రూర్కెలా భువనేశ్వర్‌లోని విమానాశ్రయాలతో అనుసంధానానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో ఒడియా ప్రజలు పెద్ద సంఖ్యలో ఉంటున్నారని, ఇరుగు–పొరుగు రెండు రాష్ట్రాల రాజధాని నగరాల మధ్య ప్రయాణికుల రాకపోకలను వేగవంతం చేసేందుకు భువనేశ్వర్‌ను హైదరాబాద్‌తో కలుపుతూ మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశ పెట్టాలని విన్నవించారు.

ట్రియల్ రన్ విజయవంతం..

హౌరా–పూరీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ మొదటి ట్రయల్ రన్ శుక్రవారం ప్రారంభమైంది. రెండో ట్రయల్ రన్ ఈనెల 30న హౌరా, భద్రక్ మధ్య ఉభయ దిశల్లో నిర్వహిస్తారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పూర్తిస్థాయి ప్రారంభోత్సవానికి సంబంధించి రైల్వే బోర్డు నుంచి అందిన తాజా సమాచారం ప్రకారం మే 1న మూడో ట్రయల్ రన్ కార్యక్రమం ఖరారు చేస్తారు. ఈ రైలులో 14 ఎయిర్ కండిషన్ చైర్‌కార్ కోచ్‌లు, రెండు ఎగ్జిక్యూటివ్ ఎయిర్ కండిషన్ చైర్‌కార్ కోచ్‌లు ఉంటాయి. 1,128 మంది ప్రయాణికులకు అధునాతన సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. వచ్చే మూడేళ్లలో దేశవ్యాప్తంగా 400 వందేభారత్ రైళ్లను నడపాలని భారత ప్రభుత్వం యోచిస్తోంది. రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ గత ఏడాది ఒడిశా పర్యటన సందర్భంగా రాష్ట్రానికి త్వరలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రాబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

క్లుప్తంగా

న్యాయవాదులదే కీలకపాత్ర

● సందడిగా ఒడిశా లాయర్స్ దినోత్సవం



మాట్లాడుతున్న కృష్ణచంద్ర గజపతి కళాశాల ప్రిన్సిపల్ అజయ్‌కుమార్ త్రిపాఠి

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో రాష్ట్ర న్యాయవాదుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. సమాజంలో విలువలు, న్యాయసేవలు అందించడంలో న్యాయవాదులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని కృష్ణచంద్ర గజపతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్‌కుమార్ త్రిపాఠి పేర్కొన్నారు. ఉత్కళమణి మధుసూదన్ దాస్ జయంతి పురస్కరించుకుని, రాష్ట్రంలోని న్యాయవాదులంతా లాయర్స్ దినోత్సవం నిర్వహించుకోవడం ఉత్తమ సంప్రదాయమన్నారు. భారత రాజ్యాంగానికి మూల స్తంభమైన న్యాయవ్యవస్థపై ప్రజలకు న్యాయబద్ధమైన పరిపాలన అందించేందుకు న్యాయవాదులు అవిరామ సేవలు అందిస్తున్నారని అభినందించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ధేశ్వర మిశ్రా, కార్యదర్శి ఎం.పృథ్వీరాజ్, ముల్లి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

● టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సిఐ సిహెచ్. లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కుని పరారైన ఇద్దరు నిందితులను టూటౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ సిహెచ్.లక్ష్మణరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కోట సత్యవతి ఈ నెల 26న శివాలయంలో పూజలు నిర్వహించి తిరిగి ఇంటికి నడుచుకుని వెళ్తుండగా రాజీవ్‌నగర్ కాలనీ వద్ద గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో ఒకటిన్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కుని పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నించిన స్థానికులు మోటార్ బైక్ నెంబర్‌ను పోలీసులకు అందించారు. దీంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శుక్రవారం దాసన్నపేట వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మోటార్ సైకిల్ నంబర్‌ను గుర్తించారు. గుర్ల మండలం చింతలపేటకు చెందిన గరుగుబిల్లి పవన్‌కుమార్, యడ్ల శివలను పట్టుకుని విచారణ చేశారు. వారి నుంచి తులంన్నర బంగారు పుస్తెల తాడు, మోటార్ సైకిల్‌ను రికవరీ చేసి, నిందితులను రిమాండ్ కు తరలించారు. కేసు ఛేదించడంలో క్రియా శీలక పాత్ర పోషించిన ఏఎస్సై పైడితల్లి, హెచ్‌సీ టీవీఆర్‌కే ప్రసాద్, కానిస్టేబుల్ వాసులను సీఐ అభినందించారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లిలో రైల్వే ట్రాక్ దాటుతుండగా విజయనగరం నుంచి రాయగడ వైపు వెళ్తున్న తిరుపతి -బిలాస్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. శుక్రవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎన్ని రాములమ్మ(70) గ్రామ సమీపంలో గల ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని సుమారు కిలోమీటర్ వరకు ఆమెను ఈడ్చుకుని వెళ్లిపోయింది. ట్రాక్ మొత్తం ఆమె శరీర భాగాలు చెదురుగా పడడంతో భయానక వాతావరణం నెలకొంది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలతో పాటు, కుమారుడు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

పార్వతీపురం: గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామానికి చెందిన కుడమల లక్ష్ముునాయుడు(70) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెండు నెలలనుంచి అనారోగ్యం కారణంగా ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో తీవ్రమనస్తాపానికి గురైన లక్ష్మునాయుడు ఇంట్లో ఉన్న గడ్డిమందును వేకువజామున తాగేశాడు. విషయం తెలుసుకున్న కుమారుడు గౌరునాయుడు చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న పెద్దచెరువు గట్టు సమీపంలో సుమారు 60 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

డయల్ 100కి వచ్చిన కాల్ ఆధారంగా అక్కడికి వెళ్లి పరిశీలించి వివరాలు సేకరించామన్నారు. కొద్దిరోజులుగా యాచక వృత్తి చేస్తూ అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, బంధువులు ఎవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని కోరారు.

స్వరాష్ట్రానికి సూడాన్ బాధితులు

● ఆపరేషన్ కావేరి విజయవంతం
● ప్రాణాలతో తిరిగి వచ్చిన 36 మంది ఒడిశా వాసులు
● అడుగడునా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నట్లు తెలిపిన బాధితులు



సూడాన్ నుంచి విమానంలో తరలి వచ్చిన భారతీయులు



తొలి విడతలో రాష్ట్రానికి చేరుకున్న ఒడియా వ్యక్తులు

భువనేశ్వర్:

సూడాన్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధం మధ్య చిక్కుకున్న 36మంది ఒడిశా వ్యక్తులు శుక్రవారం స్వరాష్ట్రానికి సురక్షితంగా తిరిగి వచ్చారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం చేరిన తర్వాత తమ ఇళ్లకు చేరి ఊపిరి పీల్చుకున్నారు. ఆపరేషన్ కావేరి ద్వారా భారత ప్రభుత్వం వారిని సూడాన్ నుంచి స్వదేశానికి విజయవంతంగా తీసుకు వచ్చింది. సూడాన్ యుద్ధ ప్రాంతంలో అనుక్షణం ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని నిద్ర, ఆహారం లేకుండా అత్యంత భయానక పరిస్థితుల మధ్య బతికి బయట పడగలిగినట్లు వాపోయారు. ఈ పరిస్థితుల్లో భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించి పోర్ట్ సుడాన్‌కు బస్సులో తిరుగు ప్రయాణమయ్యారు. అక్కడి నుంచి ఐఎన్ఎస్ సుమేధాలో దేశానికి బయలుదేరారు. న్యూఢిల్లీ మీదుగా సూడాన్ నుంచి రెండు విడతల్లో 36మంది ఒడిశా వ్యక్తులు స్వరాష్ట్రానికి తిరిగి వచ్చారు. ఆపరేషన్ కావేరి కింద సహా సీ–17 విమానంలో 392మంది భారతీయులతో కలిసి వీరిని తరలించారు. యుద్ధ ప్రాంతంలో రాష్ట్ర పౌరులు సర్వం కోల్పోయారు. స్వదేశానికి తరలించే ముందు సూడాన్ వాసులు తుపాకీతో బెదిరించి సర్వం దోచుకున్నట్లు బాధితులు వివరించారు.

సర్వం దోచుకున్నారు..

భువనేశ్వర్, బాలాసోర్, భద్రక్ మరియు జగత్‌సింగ్‌పూర్‌కు చెందిన ఆరుగురు ఒడియా వ్యక్తులు తొలి విడతలో శుక్రవారం ఉదయం చేరారు. మలి విడతలో మిగిలిన 30మంది రాష్ట్రానికి చేరుకున్నారు. అంతర్యుద్ధంతో సూడాన్‌లో తాండవిస్తున్న పరిస్థితులు ఒళ్లు గగుర్పొడుస్తున్నాయని బాధితులు వాపోయారు. 'ఏప్రిల్ 15న సైన్యం, పారా మిలిటరీ బలగాల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. అప్పటి నుచి కరెంట్ లేదు. 2రోజులపాటు కంపెనీ వీరికి రెండు పూటలా నామమాత్రపు భోజనం ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 17, 18తేదీల్లో వరుసగా రెండు రోజులు వీరి నుంచి స్థానికులు సర్వం దోచుకున్నారు. తుపాకీ గురిపెట్టి సెల్‌ఫోన్లు, డాలర్లు కాజేశా'రని సూడాన్ నుంచి తిరిగి వచ్చిన కేదార్‌కుమార్ నాయక్ తెలిపాడు.

తిండి కూడా కరువు..

బాలాసోర్ జిల్లా సొరొ ప్రాంతానికి చెందిన శివప్రసాద్ జెనా తన అనుభవాన్ని పంచుకున్నాడు. సూడాన్‌లోని ఆరతి స్టీల్‌ప్లాంట్‌లో పరిచేస్తున్న అతను.. యుద్ధ సమయంలో సుమారు 8 గంటలపాటు తమను గన్ పాయింట్‌లో నిర్బంధించారని తెలిపాడు. ప్రాణపాయం హెచ్చరికతో అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, 3వేల డాలర్లు దోచుకెళ్లారు. హింసాత్మకంగా మారిన సూడాన్‌లో పలువురు భారతీయ ప్రజలు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారని సురక్షితంగా తిరిగి వచ్చిన పవిత్రమోహన్ ప్రధాన్ తెలిపాడు. ఆ ప్రాంతంలో ఒక్కపూట భోజనం చేయడమే కష్టంగా మారడంతో అల్లాడిపోతున్నారన్నారను. సొమ్ముతో దైనందిన ఆహార నిల్వలను పాటు స్థానికులు నిలువునా దోచుకోవడంతో ఈ పరిస్థితి తాండవిస్తుందని భోరుమన్నాడు. భారత ప్రభుత్వం చొరవ కల్పించుకుని యుద్ధ పీడిత సూడాన్ ప్రాంతం నుంచి స్వదేశానికి ఢిల్లీ మీదుగా విమానంలో సురక్షితంగా తరలించడంతో తమకు కొత్త జీవితం లభించిందని ఆనందం వ్యక్తం చేశాడు. బుల్లెట్ శబ్దాలు గుండెల్లో ఇప్పటికీ దడ పుట్టిస్తున్నాయని, ప్రాణాలతో స్వదేశానికి తిరిగి వచ్చే ఆశ కోల్పోయిన పరిస్థితుల్లో ప్రభుత్వం చొరవతో స్వగ్రామానికి క్షేమంగా చేరుకోగలిగామని బసంత్‌కుమార్ మిశ్రా కృతజ్ఞత వ్యక్తం చేశాడు.

భవనం కంపించిపోయింది..

బుల్లెట్, బాంబుల వర్షంతో ఖార్టూమ్ ప్రాంతం తీవ్రంగా ధ్వంసమైంది. ఈ ప్రాంతంలో బాంబు పేలుళ్ల తాకిడికి జనావాస భవనాలు కుప్పకూలే స్థాయిలో కంపించి పోయాయని ఈ ప్రాంతం నుంచి తిరిగి వచ్చిన బాధితుడు తెలిపాడు. ఈ పరిస్థితుల్లో 9రోజులు నిరవధికంగా కంటిమీద కునుకు లేకుండా పోయిందని వాపోయాడు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని క్యాంటీన్‌కు వెళ్లడానికి కూడా భయపడిపోయారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు..

సూడాన్‌లో చిక్కుకున్న పలువురు స్వదేశం భారత్‌కు తిరిగి రాగలమనే ఆశలు కూడా కోల్పోయారు. అన్ని మాల్స్, దుకాణాలు మూసివేశారు. స్థానికుల వద్ద ఆహార పదార్థాలు కొనడానికి సొమ్ము లేదు. ఆహార నిల్వలు అడుగంటి పోయాయి. ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో సుడాన్ నుంచి సురక్షితంగా స్వదేశం భారత్‌కు తరలించిన ప్రభుత్వానికి వీరంతా కృతజ్ఞతలు తెలిపారు.

మరో బృందం..

135మంది భారతీయ పౌరులతో 10వ బ్యాచ్ పోర్ట్ సూడాన్ నుంచి ఐఏఎఫ్‌సీ 130జె విమానంలో విజయవంతంగా బయలుదేరిందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ(ఎంఈఏ) శుక్రవారం ఉదయం తెలియజేసింది. సౌదీ అరేబియాలోని జెద్దా వైపు నుంచి స్వదేశానికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఐఎన్ఎస్ సుమేధ మంగళవారం 278మంది భారతీయ పౌరులతో కూడిన మొదటి బ్యాచ్‌ను పోర్ట్ సూడాన్ నుండి జెద్దాకు రవాణా చేయడంతో ఆపరేషన్‌ను ప్రారంభించింది. భారత రాయబార కార్యాలయ వెబ్‌సైట్ ప్రకారం, సూడాన్‌లో దాదాపు 2,800 మంది భారతీయులు ఉన్నారు. దాదాపు 1,200 మంది వ్యక్తులతో స్థిరపడిన భారతీయ సంఘం కూడా ఉంది.

సరిహద్దులో ముమ్మర కూంబింగ్



పట్టుబడిన మావోయిస్టు డంప్‌తో జవాన్లు

జయపురం: ఛత్తీస్‌గఢ్ లోని దంతెవాడ జిల్లా అరణపూర్‌లో 3 రోజుల క్రితం మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి, 11మంది జవాన్లు మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటన అనంతరం ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దు లోని కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి, నవరంగపూర్, మల్కనగిరి జిల్లా బోర్డర్లు మూసివేశారు. మావోయిస్టులను పట్టుకొనేందుకు బొయిపరిగుడలో 180మంది బీఎస్‌ఎఫ్ జవాన్లు శుక్రవారం ముమ్మరంగా కూబింగ్ చేపట్టారు. వారికి రక్షణ ప్రాంతాలుగా ఉన్న బొయిపరిగుడకు 35 కిలోమీటర్ల దూరంలోని శబరీ నది పరీవాహక ప్రాంతాలు, హవాల్దికుండ్ పంచాయతీ కుంబిఖారి, ఘుదాఘాట్, మాలిపాదర్ గ్రామాల్లో అనువనువునా జల్లెడ పడుతున్నారు.

ఎదురుకాల్పులు..

నవరంగపూర్ జిల్లా రాయిఘర్ సమితి గరియబంద్-శోభా ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసులకు మధ్య గురువారం దాదాపు 30నిమిషాలు కాల్పులు జరిగాయని నవరంగపూర్ జిల్లా ఎస్పీ ఎస్.సుశ్రీ సాయంత్రం వెల్లడించారు. దంతెవాడలో జరిగిన మందుపాతర దాడిలో 11మంది జవాన్లు మరణించిన ఘటన అనంతరం కూబింగ్ ముమ్మరం చేశామన్నారు. అయితే జిల్లాలోని రాయిఘర్ సమితి సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గొరియబంద్ జిల్లా శోభా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో మావోయిస్టుల సంచారంపై సమాచారం అందిందని తెలిపారు. అప్పటికే ఆ ప్రాంతంలో2యూనిట్ల స్పెషల్ ఆపరేషన్ గ్రూప్(ఎస్‌ఓజీ) కూబింగ్ నిర్వహిస్తోంది. బుధవారం ఉదయం 9గంటలకు శోభా ప్రాంతంలో మావోయిస్టు-పోలీసులకు మధ్య కాల్పులు జరిగాయని వివరించారు. దట్టమైన అడవి కావడంతో వారంతా పరారయ్యారని, ఆచూకీ కోసం గాలిస్తున్నామని ప్రకటించారు. అలాగే సమీపంలోని శిబిరంలో డంప్ స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 2తుపాకులు, కరపత్రాలు, బ్యానర్లు, విద్యుత్ వైర్, సోలార్ ప్లేట్లు, 6 తూటాలు, బ్యాటరీలు, 2 గొడ్డళ్లు, వంట సామగ్రి ఉన్నాయి.



నవరంపూర్ జిల్లా రాయిఘర్-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జొన్నకు కనీస 'మద్దతు' ఇవ్వాలి

● ట్రేడర్స్ సమావేశంలో జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: కనీస మద్దతు ధర తగ్గకుండా మొక్కజొన్న కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ట్రేడర్‌లు, విజయనగరం బయోటెక్ ప్రతినిధులతో మొక్కజొన్న ధరపై నిర్వహించిన సమావేశంలో సూచించారు. రైతులు ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్నారని వారికి మంచి గిట్టుబాటు ధర కల్పించాలని స్పష్టం చేశారు. కనీస మద్దతు ధర క్వింటాకు రూ.1,962 ఉండగా ట్రేడర్స్ రూ.1,900 మాత్రమే చెల్లిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ట్రేడర్లకు కావలసిన గొడౌన్ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో మార్కెట్ యార్డ్ పరిధిలో గొడౌన్‌లు ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని సూచించారు. పలువురు ట్రేడర్స్ మాట్లాడుతూ 15 రోజుల క్రితం తాము రూ.2,250కు కూడా క్వింటా కొన్న సందర్భాలు ఉన్నాయని చెప్పారు.

ఉపాధి కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువకులకు ఉపాధి కలిగించే పలుకోర్సులకు ఉచిత శిక్షణ తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వసతిగృహంలో నిర్వహిస్తామని సంస్థ నిర్వాహకుడు బీవీరమణ తెలిపారు. పురుషులకు హౌస్ వైరింగ్, మెన్స్ టైలరింగ్ అండ్ ఇన్‌స్టాలేషన్ ఆఫ్ సీసీటీవీ కెమెరా కోర్సులపై శిక్షణ ఉంటుందని తెలిపారు. 30 రోజులపాటు వసతి భోజన సౌకర్యాలను ఉచితంగా కల్పించే ఈ కోర్సులకు తెల్లకార్డుదారులు, 45 ఏళ్లలోపు ఉన్న గ్రామీణ ప్రాంత పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల 10వ తేదీ లోపు దరఖాస్తులను కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాల కోసం 9959521662, 9985787820 ఫోన్ నంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

రైల్వే లైన్ బాధిత కుటుంబాలకు న్యాయం

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: రైల్వే 3వ లైన్ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు హామీ ఇచ్చారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలక సంఘం పరిధి 9వ వార్డులో గల విజయరామరాజు కాలనీలో శుక్రవారం ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప్పర వీధి ప్రాంతానికి చెందిన స్థానిక ప్రజల నివాసాలు రైల్వే మూడవ లైన్ అభివృద్ధి పనుల కోసం అవసరమైన భూ సేకరణలో భాగంగా ఇటీవల రైల్వే అధికారులు కొలతలు తీసుకున్నారని, సుమారు 75 గృహాలు నష్టపోయే పరిస్థితి ఎదురవడంతో ఆయా నివాసాల కుటుంబాలు ఆందోళన చెందుతున్న విషయాన్ని తెలుసుకున్నానని చెప్పారు. అందులో భాగంగా మీ ప్రాంతాన్ని సందర్శించి మిమ్మల్ని స్వయంగా సమస్యలు అడిగి తెలుసుకుంటున్నానన్నారు.

మమ్మల్ని ఆదుకోవాలి

ఎమ్మెల్యే స్వయానా తమ ప్రాంతానికి విచ్చేయడంతో స్థానిక ప్రజలు అంతా విచ్చేసి రైల్వే లైన్ పనుల్లో భాగంగా తమ నివాసాలు పోతే ఎక్కడ ఉండాలని, నిలువ నీడ లేదని మీరే ఆదుకోవాలని ప్రజలంతా ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. దీంతో వారి సమస్యల మీద వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా రెండు రోజుల్లోగా రైల్వే అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు సముచిత న్యాయం జరిగేలా తన వంతు ప్రయత్నం తప్పక చేస్తానని హామీ ఇచ్చారు. స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పి.జయంతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, కో ఆప్షన్ సభ్యుడు మేరువ వెంకట్రావు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రపంచ పోటీలకు వెళ్లేందుకు సహకరించండి



టెన్నికాయిట్ క్రీడాకారిణి మౌనికను అభినందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: సౌత్‌ఆఫ్రికాలో జరగనున్న 5వ ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సహకారం అందించాలని గరివిడి మండలంలోని కేవీల్ పురం గ్రామానికి చెందిన టెన్నికాయిట్ క్రీడాకారిణి రెడ్డి మౌనిక కోరింది. ఈ మేరకు శుక్రవారం ఆమె ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను ఆయన నివాసంలో కలిసింది. ఈ సందర్భంగా ఎంపీతో మాట్లాడుతూ 2023 సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 8 వరకు సౌత్‌ఆఫ్రికాలో 5వ ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ జరగనుందని, దీనికి సంబంధించి మే 10 నుంచి 23 వరకు చెన్నైలో ప్రాబబుల్స్‌కు శిక్షణ జరగనుందని స్పష్టం చేసింది. భారతదేశం నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్‌కు వెళ్లేందుకు ప్రతి రాష్ట్రం నుంచి ఇద్దరు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేయగా అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక చేసిన ఇద్దరిలో తాను ఉన్నట్లు చెప్పింది. సౌత్ ఆఫ్రికా వెళ్లేందుకు రవాణా, వసతి సంబంధిత అవసరాల కోసం ఆర్థిక సహకారం అందించాలని కోరింది. దీనికి స్పందించిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మౌనికను అభినందించి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

పీహెచ్‌సీల్లో మరిన్ని వైద్యపరీక్షలు

● అందుబాటులోకి అధునాతన పరికరాలు
● రోగులకు 63 రకాల పరీక్షలు చేయనున్న వైద్యాధికారులు
● శిక్షణ పొందిన ల్యాబ్‌టెక్నీషియన్లు



తారాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు



రామభద్రపురం పీహెచ్‌సీలో పరీక్షలు చేసే మెషిన్లను చూపిస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్ ఆనంద్

రామభద్రపురం: ప్రతి వ్యక్తికి మెరుగైన ఉచిత ఆరోగ్య సంరక్షణ కోసం నాడు-నేడు పేరుతో ఆస్పత్రుల రూపురేఖలను మార్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో రోగులకు మరిన్ని వైద్యపరీక్షలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందుకోసం వైద్యారోగ్యశాఖ అధునాతన యంత్ర పరికరాలను పీహెచ్‌సీలు, యూహెచ్‌సీలకు అందజేసింది.జిల్లాలో 50 పీహెచ్‌సీలు,18 యూహెచ్‌సీలు ఉన్నాయి. వాటికి ఒక్కోదానికి సీబీసీ, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్, టీబీ ఆర్టీపీఆర్ వంటి అధునాతన యంత్ర పరికరాలను సమకూర్చింది. ఇప్పటి వరకూ వాటిలో కేవలం 15 నుంచి 20 రకాల వైద్య పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు కొత్తగా చేరిన పరికరాలతో కలిపి వాటి సంఖ్య 63కు పెరగనుంది. వైద్య పరీక్షల నిర్వహణ కోసం ప్రతి పీహెచ్‌సీ, యూహెచ్‌సీలలో ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించారు.ఇప్పటికే వారికి అధునాతన యంత్ర పరికరాల నిర్వహణపై శిక్షణ కూడా ఇచ్చారు.

పేద రోగులకు ఎంతో మేలు

గతంలో పీహెచ్‌సీలలో చాలా రకాల వైద్య పరీక్షలు లేకపోవడంతో వాటి కోసం రోగులు సమీప ఏరియా ఆస్పత్రి, జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి లేదా ప్రైవేట్ అసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇది పేద కుటుంబాలకు చెందిన రోగులకు ఆర్థిక భారం అయ్యేది. రోగితో పాటు వెళ్లిన వారు అదనంగా శ్రమ పడాల్సి వచ్చేది. దీనివల్ల రోగ నిర్ధారణకు ఎక్కువ సమయం పట్టేది. అప్పటి వరకు రోగికి కచ్చితమైన వైద్యం అందేది కాదు. ప్రస్తుతం అదనపు వైద్య పరీక్షలు పీహెచ్‌సీలలోనే అందుబాటులోకి రావడంతో కొన్ని గంటల వ్యవధిలోనే రోగుల వ్యాధి నిర్ధారణ వీలవుతోంది. ఫలితంగా ఇబ్బంది ఉన్న రోగికి వెంటనే మెరుగైన వైద్యసేవలు అందించడానికి అవకాశం కలుగుతోందని వైద్యాధికారులు చెబుతున్నారు.

పీహెచ్‌సీలో చేసే వైద్య పరీక్షలు


సీఆర్‌పీ, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, యూఆర్‌ఈఏతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్, కౌంట్, సీబీసీ, టోటల్ బ్లడ్ సెల్‌కౌంట్, ర్యాండమ్ బ్లడ్ సుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, హెచ్‌ఐవీ, హెపటైటిస్-బి, డెంగీ, బ్లీడింగ్, క్లాటింగ్ టైమ్, థైరాయిడ్,పొటాషియం, క్లోరైడ్ తదితర 63 రకాల పరీక్షలు చేయనున్నారు. వైద్యపరీక్షలపై గ్రామాలలో రోగులు, ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలు, ఆశవర్కర్లకు వైద్యాధికారులు సూచిస్తున్నారు.

పీహెచ్‌సీలకు చేరిన పరికరాలు



రోగులకు వివిధ రకాల వైద్యపరీక్షలు చేయడానికి అవసరమైన అధునాతన యంత్ర పరికరాలు, మెషినరీ ఇప్పటికే పీహెచ్‌సీలకు చేరాయి. వైద్య పరీక్షలు ఎలా చేయాలో ప్రాథమికంగా ల్యాబ్‌టెక్నీషియన్లకు శిక్షణ కూడా ఇచ్చాం. సేవల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నాం.త్వరలోనే పీహెచ్‌సీ, యూహెచ్‌సీలలో పేదలకు అన్ని రకాల పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి రానున్నాయి. **ఎస్‌వీ రమణకుమారి, జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి**

ఈ నెలలో సేవలు ప్రారంభం



ఈ నెలలో 63 రకాల వైద్యపరీక్షలు రోగులకు అందుబాటులోకి వస్తాయి. ఇక పరీక్షల కోసం పట్టణ ప్రాంతాలకు, ప్రైవేట్ ఆస్పత్రులకు పేద రోగులు వెళ్లాల్సిన అవసరం లేదు.త్వరగా రోగ నిర్ధారణ అవుతుంది.వెంటనే అవసరమైన వైద్యం అందిస్తాం. **ఏఎల్‌జి శిరీష, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, రామభద్రపురం**

అక్రిడేషన్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ

● కలెక్టర్ నాగలక్ష్మి ఎస్



కలెక్టర్ నాగలక్ష్మి ఎస్

విజయనగరం అర్బన్: 2023–24 కాలపరిమితికి గాను జారీ చేయనున్న జర్నలిస్టుల అక్రిడిటేషన్లకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైందని జిల్లాలోని సంబంధిత పాత్రికేయులు దరఖాస్తు సమర్పించుకునేందుకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 38లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన ఆయా పత్రికలు, టీవీలు, న్యూస్ ఏజెన్సీలకు చెందిన ప్రతినిధులు, వెటరన్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు ఈ నెల 28వ తేదీ నుంచి మే నెల 15వ తేదీలోగా 'ఐపీఆర్.ఏపీ.జీఓవి.ఐఎన్' అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. సదరు జీవో మేరకు జర్నలిస్టులు వారి వివరాలతోపాటు యాజమాన్యాల సిఫారసు లేఖ, అవసరమైన డాక్యుమెంట్లు పీడీఎఫ్ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, దరఖాస్తుదారు సంతకం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ అనంతరం సంబంధిత అప్లికేషన్ ప్రింట్ తీసి, దానితో పాటు అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్‌లు, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి, విజయనగరం కార్యాలయంలో మే నెల 16వ తేదీలోగా అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

వెబ్‌సైట్‌లో పేర్లు యాడ్ చేయించుకోవాలంటే..

ఆయా పత్రికలు, టీవీల పేర్లు వెబ్‌సైట్‌లో యాడ్ చేయించుకేందుకు జీఓ నంబర్ 38లో పేర్కొన్న విధంగా టీవీ సంస్థలైతే తాజా వార్షిక పన్ను చెల్లింపు పత్రాలు, ఐబీ లైసెన్స్, పత్రికలైతే ఆర్ఎన్ఐ సర్టిఫికెట్, ఆర్ఎన్ఐకు సమర్పించిన తాజా వార్షిక పన్ను చెల్లింపు నకలు కాపీ, పేజీల సంఖ్య, సర్క్యులేషన్ వివరాలతో కూడిన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కేబుల్ టీవీలకు సంబంధించి కేబుల్ టీవీ యాక్ట్ 1995 నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సమర్పించాలని పేర్కొన్నారు.

హోటల్స్ ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పార్వతీపురం: హోటళ్లు ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా పర్యాటక అధికారి ఎస్.నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్స్, లాడ్జిలు, రెస్టారెంట్లు, వెల్‌నెస్ సెంటర్లు, ట్రావెల్ ఆపరేటర్లు, ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికెట్‌తో పాటు, కేంద్ర ప్రభుత్వం సాథి-నిధి అందజేస్తుందని, ఈ సర్టిఫికెట్ పొందిన వారికి పర్యాటక ప్రయోజనాలు చేకూరతాయన్నారు. హోటల్స్, రెస్టారెంట్లు, లాడ్జిలు, గెస్ట్ హౌస్‌లకు రూ.300, హోం స్టేలు, ఫాం స్టేలకు రూ.200, టూర్ బోటు ఆపరేటర్లు, అడ్వెంచర్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్ ఆపరేటర్లకు రూ.500లు, వెల్‌నెస్ సెంటర్లు, కన్వెన్షన్ హాలు, సర్వీసు అపార్ట్‌మెంట్లకు రూ. 500లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వివరించారు. డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.ఏపీటూరిజం.జీఓవీ.ఇన్‌వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు జిల్లా పర్యాటక అధికారి ఫోన్ 6309942033, 8919168306 నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

మెట్కోర్ నిర్వాహకులపై సబ్ కలెక్టర్ మండిపాటు



కార్మికులు, నిర్వాహకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

టెక్కలి రూరల్: రావివలస మెట్కోర్ అల్లాయిస్ పరిశ్రమ నిర్వాహకులపై టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన పరిశ్రమను సందర్శించారు. వేతనాలు ఇవ్వడం లేదని, అందరికి పనులు కల్పించడం లేదని, విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు, సెటిల్‌మెంట్లు చేయలేదని, స్థానికులకు 70శాతం ఉద్యోగాలు ఇవ్వడం లేదంటూ తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, అసలు పరిశ్రమను నిర్వహిస్తున్నది ఎవరంటూ ప్రశ్నించారు. దీనిపై నిర్వాహకులు స్పందిస్తూ ఫాక్టరీ రేవా కమ్యూనికేషన్ వారు మెట్కోర్ అల్లాయిస్‌కు అప్పగించారని, వారు శ్యామ్ ఇంజినీరింగ్ సంస్థతో నడిపిస్తున్నారని అంటూ పొంతనలేని సమాధానం చెప్పడంతో మండిపడ్డారు. జీతాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. దీనిపై నిర్వాహకులు స్పందిస్తూ పరిశ్రమ నష్టాల్లో ఉందని, మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి మూసివేస్తామని చెప్పారు. అనంతరం గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పొల్యూషన్ కంట్రోల్ ఈఈ శంకర్‌నాయక్‌తో కలిసి డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. నిబంధనలు పాటించకపోవడంతో తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆర్మీ జవాన్ త్యాగాలు వెలకట్టలేనివి



వరలక్ష్మికి నగదు అందిస్తున్న ఆర్మీ అధికారి

సరుబుజ్జిలి: ఆర్మీజవాన్లు మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించడం వెలకట్టలేని విషయమని మద్రాస్ ఆర్మీ రెజిమెంట్ జూనియర్ కమిషన్ ఆఫీసర్ జె.చంద్రరావు కొనియాడారు. పురుషోత్తపురం గ్రామానికి చెందిన పైడి మోహనరావు ఆర్మీ ఓపీ రక్షక్ విభాగంలో పనిచేస్తూ జమ్మూకాశ్మీర్‌లో 2012లో విధి నిర్వహణలో మృతిచెందారు. ఈ సందర్భంగా గ్రామంలో అమరజవాన్ ఇంటి వద్ద ఆర్మీ అధికారులు వీరనారి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తల్లి పైడి వరలక్ష్మిని ఇంటివద్ద సత్కరించి నగదు అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ మేజర్ సీపాన వరహానర్సింహం(నాగం), పంచాయతీ ఉపసర్పంచ్ పైడి నర్సింహ అప్పారావు, ఆర్మీ సిపాయి దామోదరరావు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమశాఖలో కారుణ్య నియామకాలు



అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: కరోనా సమయంలో ఉద్యోగం చేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు సాంఘిక సంక్షేమ శాఖకు కేటాయించిన వారికి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఖాళీల మేరకు అభ్యర్థులు కోరుకున్న చోటకు నియామక పత్రాలు అందజేశారు. 11 మంది అభ్యర్థులను గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ ఉద్యోగాలలో నియమించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఆర్.గడ్డెమ్మ, అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల అందజేత



ముస్తాబైన ఏపీ టిడ్కో ఇళ్లు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళంలోని టిడ్కో ఇళ్లను శనివారం లబ్ధిదారులకు అందజేయనున్నారు. పాత్రునివలసలో నిర్మించిన ఈ ఇళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. కార్యక్రమానికి స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పాల్గొంటున్నట్లు తెలిపారు.






శ్రీకూర్మం దేవాలయంలోని గోడలపై నాటి కుడ్య చిత్రాలు

చారిత్రక కుడ్యాలపై నిర్లక్ష్యపు పూత



రాతితో నిర్మించిన ప్రధాన ఆలయం

- శ్రీకూర్మనాథాలయంలో మసకబారుతున్న గోడలు
- కుడ్య చిత్రాలపైనే సున్నం!
- చారిత్రక సంపద పరిరక్షణపై కానరాని శ్రద్ధ

కళా శాస్త్రం ప్రకారం మనకు 64 కళలు ఉన్నాయి. వాటిలో విశిష్టమైనది చిత్రకళ. ఇందులోనూ ఎన్నో ప్రక్రియలు.. ఇళ్లలో, మ్యూజియంలలో వర్ణ, తైల చిత్రాలు ఒక రకమైతే. గోడలపై చిరస్థాయిగా నిలిచిపోయేలా వేసేవి కుడ్య చిత్రాలు. ఇవి గత చరిత్రను, ఆయా ప్రాంతాల, కట్టడాల వైశిష్ట్యాన్ని సందర్శకుల కళ్లకు కడతాయి. ఇటువంటివి పురాతన దేవాలయాల్లో ప్రధానంగా కనిపిస్తుంటాయి. అత్యంత పురాతన క్షేత్రంగా, కూర్మావతారంలో విష్ణుమూర్తి కొలువైన దేశంలోని ఏకైక క్షేత్రంగా వెలుగొందుతున్న శ్రీకూర్మంలో ఇలాంటి కుడ్య చిత్రాలు 24కు పైగా ఉన్నాయి. దురదృష్టవశాత్తు శతాబ్దాల చరిత్ర కలిగిన వీటిని కాపాడుకోవాలన్న శ్రద్ధ కొరవడింది. ఆలయాన్ని నిత్యనూతనంగా ఉంచే క్రమంలో గోడలకు తరచూ వెల్ల వేస్తుంటారు. ఆ సమయంలో కుడ్య చిత్రాలపై కూడా సున్నం పూసేస్తుండటంతో అవి క్రమంగా మాసిపోయి కనుమరుగు అవుతున్నాయి. చరిత్రను భావితరాలకు అందకుండా చేస్తున్నాయి.

– శ్రీకాకుళం డెస్క్



ఆలయంలో నల్లరాతి స్తంభం



కుడ్య చిత్రం

తంజావూరు చిత్రం అంటే కళాపిపాసులు ఎంత డబ్బులు వెచ్చించేందుకైనా సిద్ధపడతారు. అలాంటి చిత్రాన్ని ఇళ్లలో ఉంటే ఓ హోదాగా ఫీలవుతారు. వాటిని చూసేందుకు క్యూ కడతారు. అందులో కళని ఆస్వాదిస్తారు. మరి తంజావూరు చిత్రానికి ఆద్యమైన శతాబ్దాలు నాటి చిత్రాలు చరిత్రకు సాక్షీభూతాలుగా నిలుస్తుంటే మాత్రం వాటి పరిరక్షణను గాలికొదిలేశారు. 470 ఏళ్ల నాటి చిత్రాలు దేవాలయాల గోడలపై మనల్నే పరీక్షగా చూస్తూ ఉంటే వాటిని నిర్వహణను నిర్లక్ష్యం చేస్తున్నారు. వీటిని ఎలా గీశారు.. వీటి గొప్పతనం ఏమిటో తెలుసుకుందాం పదండి.

శ్రీకూర్మనాథ క్షేత్రం.. ఎంతో విశిష్టత కలిగిన చారిత్రక నేపథ్యం ఉన్న ఆలయం. ప్రతి అడుగుకూ ఓ చరిత్ర. ప్రతి అంగుళానికి ఓ విశిష్టత. ప్రతిదీ కళాత్మకమే. ఎప్పటిదీ ఈ ఆలయం అంటే మాత్రం.. 2వ శతాబ్దం నుంచి 15వ శతాబ్దం వరకు లింకులు కనిపిస్తాయి. పురాణాలు.. ఆలయ పరిసరాల్లో భక్తులకు సమాచారం వివరించే బోర్డుల్లో మాత్రమే ప్రస్తుతం ఆలయం 700 ఏళ్ల క్రితం నాటిదని రాసి ఉంటుంది. ఈ ఆలయంలోని గోడలపై 24 వరకు వివిధ కుడ్య చిత్రాలుండేవి. ప్రస్తుతం కొన్నే ఉన్నాయి. వీటిని సహజసిద్ధమైన రంగులు.. కొన్ని ఖనిజాలు, ధాతువుల మిశ్రమాలను కలిపి గోడలపై చిత్రించారు. రామాయణ, భారత, భాగవతాలలోని కొన్ని ఘట్టాలను ఈ కుడ్య చిత్రాల రూపంలో ఇప్పటికీ మనం చూడొచ్చు. వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వీటి ప్రభ రోజురోజుకీ తగ్గిపోతోంది. అరుదైన చిత్ర సంపద ఇక్కడ ఉన్న విషయం కూడా చాలా మంది సందర్శకులు, భక్తులకు తెలియకపోవడం విశేషం.

ఏయే చిత్రాలు..

చతుర్భుజ విష్ణు, సుగ్రీవుడు ఆయన భార్య తార, ఏనుగు, గుర్రం, గజేంద్ర మోక్షం, మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, త్రివిక్రమ అవతారాలు, సుభద్ర,బలభద్ర సహిత జగన్నాథుడు, శ్రీకృష్ణుడు గోపికా వస్త్రాపహరణం, కాళీయమర్దనం, భకసంహారం, క్షీరసాగరంలో శేషతల్పంపై విష్ణుమూర్తి, ధ్యాన ముద్రలో సరస్వతి, గజలక్ష్మి, గోవర్ధన గిరిధారి, శ్రీకూర్మ క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించే క్షీరసాగరమథనం వంటి సన్నివేశాలు కుడ్య చిత్రాల రూపంలో ఉన్నాయి. తెలంగాణలో సూర్యాపేట జిల్లాలోని పిల్లల మర్రి సోమేశ్వరాలయంలో ఇలాంటి చిత్రాలున్నాయి. అయితే ఇవి 14 శతాబ్దం నాటివిగా పరిశోధకులు అంచనా. అదే క్రమంలో 17 శతాబ్దం చివరిలో శ్రీకూర్మం ఆలయంలోని గోడలపై ఈ చిత్రాలు గీసారని చరిత్ర కారుల అంచనా.

లభ్యమైన తొలి శాసనం ఏం చెబుతోంది:

ఆలయంలో 204 శాసనాలు లభ్యమయ్యాయని చారిత్రక పరిశోధకులు చెబుతున్నారు. ఈ శాసనాలు సంస్కృతం, తెలుగు, ఒడియా భాషల్లో ఉన్నాయి. ఈ ఆలయం 11–12 శతాబ్దాల నాటిదని శాసనాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇలా చేస్తే మేలు..

- వీటి పరిరక్షణకు వివిధ శాఖలు సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
- సున్నం ఇతర రంగులు వేసే క్రమంలో జాగ్రత్తలు పాటించాలి. వైరింగ్, లైటింగ్ వంటివి ఏర్పాటు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి.
- సందర్శకులకు వీటి ప్రత్యేకతల్ని వివరించేలా ప్రత్యేక బోర్డులు ఏర్పాట్లు చేయాలి.

ఏ ఒక్కటీ ఒకేలా ఉండదు..

ఆలయంలో తిరుచుట్టూమాల (ప్రదక్షిణలు చేసే ప్రాంతం) ఉంటుంది. ఈ మండపంలో 50 స్తంభాలుంటాయి. ఏ ఒక్క స్తంభం మరో స్తంభాన్ని పోలి ఉండదు. దేనికదే ప్రత్యేకశైలితో నిర్మించారు. స్తంభాలపై ప్రాచీన ఆరోగ్య సూత్రాలు.. శాసనాలు చూడొచ్చు. కొంచెం దృష్టిపెడితే చదవొచ్చు కూడా.

ఆలయ ప్రత్యేకతలు:

శైలి: ఉత్తరాంధ్రలో మనకు కనిపించే పురాతన ఆలయాలన్నీ కళింగ శైలిలో నిర్మితమై ఉంటే.. శ్రీకూర్మనాథ క్షేత్రం మాత్రం చాళుక్య శైలిలో నిర్మితమైంది.

- రెండు ధ్వజస్తంభాలున్న ఏకైక ఆలయం.
- పితృకర్మలు, పిండప్రధానాలు ఇక్కడ పుష్కరిణిలో చేస్తారు.
- కూర్మనాథుడు మూల విరాట్టుగా పూజలందుకుంటున్న దేశంలోనే ఏకైక ఆలయం.

ప్రముఖుల సందర్శన: ఈ ఆలయాన్ని రామానుజాచార్యులు, చైతన్య మహాప్రభు సందర్శించినట్లు చరిత్ర చెబుతోంది. కృష్ణదేవరాయులు కూడా ఈ ఆలయాన్ని సందర్శించినట్లు సాహిత్యపరమైన ఆధారాలు ఉన్నాయి.

ఎక్కడ ఉంది:

- శ్రీ కూర్మనాథ క్షేత్రం.. సిక్కోలుకు 20 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- రవాణా సదుపాయం ఉంది.
- నక్షత్ర తాబేళ్లను పెద్ద సంఖ్యలో ఇక్కడ చూడొచ్చు.

అతిపురాతన ఆలయం..



శ్రీకూర్మనాథ క్షేత్రం అత్యంత పురాతన ఆలయం. నాటి పాలకుల కారణంగా రకరకాల మార్పులకు గురైన ఆలయం. కుడ్య చిత్రాలు 17వ శతాబ్దం చివరిలో వేసిఉండొచ్చు. ఇది అరుదైన చారిత్రక సంపద. ఇందులో రామాయణ, భారత, భాగవత ఘట్టాలు గోడలపై చిత్రించారు. వీటిని పరిరక్షించి భావితరాలకు అందించాలి. ఇక్కడ 204 శిలా శాసనాలు లభ్యమయ్యాయి. –ప్రొఫెసర్ కొల్లూరు సూర్యనారాయణ, హిస్టరీ విభాగాధిపతి, ఆంధ్రాయూనివర్సిటీ.

నేడే నవోదయ పరీక్ష

- 36 కేంద్రాల్లో నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- 80 సీట్లకు గాను 8447 మంది పోటీ
- ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ పరీక్ష



నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెంటర్‌లో బెంచీలపై నంబర్లను సరిచూస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్న జవహర్ నవోదయా స్కూల్స్‌లో సీట్ల కోసం ఏటా పోటీ పెరుగుతోంది. 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఏకంగా 8447 మంది పోటీపడుతున్నారు. 80 సీట్లు మాత్రమే ఉండగా 8447 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆరో తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్మీడియెట్ వరకూ చదువుకోవచ్చు. విద్యతో పాటు క్రీడలు, సాహస కృత్యాలు, అధునాతన శిక్షణకు జవహర్ నవోదయా స్కూల్స్ వేదికగా నిలుస్తున్నాయి. జిల్లాలో సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో నవోదయా స్కూల్ ఉండగా రానున్న విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో విద్యార్థులను చేర్చుకోవడానికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు.

పక్కాగా ఏర్పాట్లు..

ప్రవేశ పరీక్ష నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎక్కడా అవకతవకలకు డీఈఓ తిరుమల చైతన్య, నవోదయ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 8447 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరవుతున్నారు.

80 ప్రశ్నలు.. 100 మార్కులు..

ప్రశ్నపత్రం వంద మార్కులకు ఉంటుంది. 80 ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ 50 మార్కులకు 40 ప్రశ్నలు, గణితంలో 25 మార్కులకు 20 ప్రశ్నలు, భాషా పరిజ్ఞానంలో 25 మార్కులకు 20 ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థులు 11 కల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ రెండు గంటల పాటు పరీక్ష నిర్వహిస్తారు.

నవోదయ పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తెలిపారు. శనివారం జరిగే పరీక్షకు సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 30 కేంద్రాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష జరుగుతుందని, పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అధికారులు, ప్రధానోపాధ్యాయులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: నవోదయ ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాధ్యతగా నిర్వహించాలి..



నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. నవోదయ అధికారుల సూచనల మేరకు కేంద్రాల చీఫ్‌లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ఇన్విజిలేటర్లు బాధ్యతగా ప్రవేశ పరీక్ష నిర్వహించాలి. – తిరుమల చైతన్య, డీఈఓ

విద్యార్థులకు సూచనలు..

- విద్యార్థులు రెండు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.
- హాల్ టికెట్‌పై సంబంధిత పాఠశాల హెచ్‌ఎం సంతకం చేయించాలి.
- బ్లూ/బ్లాక్ పెన్నుతోనే పరీక్ష రాయాలి.
- ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకెళ్లరాదు.
- మాస్క్, శానిటైజర్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలి.

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో అతిథులు, సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా శుక్రవారం జరిగాయి. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన బాలబాలికలను చెరో 20 మంది చొప్పున జిల్లా ప్రాబబుల్స్ జట్లకు ఎంపికచేశారు. త్వరలో వీరికి శిక్షణా శిబిరాలను నిర్వహించి తుది జట్లు ప్రకటించనున్నారు. ఇక్కడ ఎంపికైన వారు మే 26 నుంచి 28 వరకు వైఎస్సార్ కడప జిల్లా రాయచోటి వేదికగా జరిగే 10వ ఏపీ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారు.

అనంతరం సీనియర్ నేషనల్స్‌లో బంగారు పతకం సాధించిన వై.మల్లేష్, సౌత్‌జోన్ సీనియర్ నేషనల్స్‌లో బంగారు పతకం సాధించిన ఎస్.హరిహరణ్ సంఘ నాయకులు, అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదండి వెంకటరామరాజు, పి.సుందరరావు, కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.వి.రమణ, ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, బొడ్డేపల్లి సురేష్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.వి.రమణ, గురుగుబెల్లి రాజశేఖర్, సతీష్‌రాయుడు, ఢిల్లేశ్వరరావు, రెడ్డి రవి, అన్నెపు రాజగోపాల్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సెస్ బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో రాజేశ్వరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ప్రభుత్వ శాఖలు కార్మిక శాఖకు తక్షణమే సెస్ బకాయిలు చెల్లించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి ఆదేశించారు. బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యాక్ట్–1996, బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ సెస్ యాక్ట్–1996, కన్‌స్ట్రక్షన్ వెల్ఫేర్ సెస్ రూల్స్‌పై జిల్లా అధికారుల సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రభుత్వేతర భవన నిర్మాణాలు, కట్టడాలలో ప్రభుత్వానికి ఒక శాతం సెస్ చెల్లించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని శాఖలు ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. జిల్లాలో రూ.కోటీ 12 లక్షల 47 వేల 496కు గాను ఇప్పటివరకు రూ.49 లక్షల 10వేల 654 మాత్రమే సెస్ చెల్లించినట్లు వివరించారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎస్.డి.వి.ప్రసాదరావు, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకటరామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, ఏపీఐఐసీ మేనేజర్ బి.రామకృష్ణ, సుడా ప్లానింగ్ అధికారి టి.జి.రామ్మోహన్, పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకులు పి.వి.రఘునాథ్, నగరపాలక సంస్థ ఇంజినీర్ పి.వి.గంగాధరరావు, సహాయ సంచాలకులు ఎం.బాలాజీ నాయక్, బి.ఆర్.ఆర్.వంశధార ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

'సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలి'



సమ్వేధన్ టెక్నికల్ ఫెస్ట్ ప్రారంభిస్తున్న డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ఎస్‌ఎం పురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో శుక్రవారం, శనివారం నిర్వహించనున్న సీఎస్‌ఈ ఇంజినీరింగ్ విభాగం సమ్వేధన్ టెక్నికల్ ఫెస్ట్–2023ను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులు పరిశీలించారు. డైరెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అంతర్జాతీయంగా సాంకేతిక ప్రగతి శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడం, నిరంతరం నూతన ఆవిష్కరణలు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్‌లో రిలీవ్ అవుతున్న విద్యార్థులకు మంచి ప్యాకేజీలతో కూడిన వేతనాలు లభిస్తున్నాయని, ఉన్నత విద్యకు మంచి విద్యాసంస్థల్లో సీట్లు లభిస్తున్నాయని అన్నారు. నిరంతరం శ్రమించి చదవాలని చెప్పారు.

క్రైం కార్నర్


పిడుగుపడి కౌలు రైతు మృతి



మన్మధరావు మృతదేహం

హిరమండలం: పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పిడుగు పడి కౌలు రైతు మృతి చెందాడు. కొమనాపల్లి గ్రామానికి చెందిన ఎండు మన్మధరావు(47) శుక్రవారం సాయంత్రం పొలంలో నువ్వు చేను తీస్తుండగా పిడుగుపాటుకు గురయ్యాడు. పక్కపొలంలో పని చేస్తున్న వారు వచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. మన్మధరావుకు భార్య కృష్ణవేణి, కుమార్తె దాక్షాయని, కుమారుడు వంశీకృష్ణ ఉన్నారు. ఎస్సై స్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు.

• రైలు పట్టాలపై యువకుడి మృతదేహం



యువకుడి మృతదేహం

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస సమీపంలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్‌పి ఎస్సై షరీఫ్ సిబ్బందితో కలసి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 25–30 ఏళ్లు ఉంటుందని, నౌపడ నుంచి గుణ్‌పూర్ వైపు వెళ్లే ట్రైన్ కింద పడిపోయి ఉంటాడని తెలిపారు. మృతుడు ఎరుపు గీతల చొక్కా, జీన్స్ ఫ్యాంట్ ధరించాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం పలాస రైల్వే ఆస్పత్రికి తరలించారు.

• పొందూరు స్టేషన్ సమీపంలో వృద్ధుడు..



వృద్ధుడి మృతదేహం

పొందూరు: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు(65) శుక్రవారం మృతి చెందినట్లు పలాస జీఆర్పీ ఎస్‌ఐ ఎస్.కె.షరీఫ్ తెలిపారు. రైలు నుంచి జారి పడటం గానీ, పట్టాలు దాటుతున్నప్పుడు గానీ ప్రమాదం జరిగి ఉండవచ్చునని భావిస్తున్నట్లు చెప్పారు. ఎరుపు చొక్కా, కాషాయం లుంగీ, కుడి పక్కటెముకులు ఎడమ కన్ను దిగువన పుట్టుమచ్చలున్నాయని తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9491106219 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

• ఇంటర్ విద్యార్థి అదృశ్యం



మర్ల భానుప్రకాష్

కవిటి: మండలంలో కవిటికొత్తూరుకు చెందిన మర్ల భానుప్రకాశ్ అనే ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి పరీక్ష ఫలితాలు వెలువడిన తర్వాత రోజు నుంచి కనిపించడం లేదని తండ్రి మాధవరావు కవిటి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఫస్టియర్ చదివిన భానుప్రకాష్ ఫెయిలయ్యాడు. ఇంట్లో మందలించడంతో 27వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఫలితాలు వెలువడక ముందు తిరుపతి వెంకన్న దర్శనం చేసుకున్నాడు. ఆ ప్రసాదాన్ని కవిటిలో బంధువుల ఇంటికి ఇచ్చేందుకు వెళ్లి తర్వాత తిరిగిరాలేదు. ఎంతవెతికినా ఆచూకీ లభించలేదని కుటుంబసభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

• ట్రాక్టర్–ఆటో ఢీ.. నలుగురికి గాయాలు



నుజ్జయిన ఆటో

రణస్థలం: మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి సమీపంలో కొండములగాం రహదారిలో ట్రాక్టర్ ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండములగాం వైపు నుంచి రణస్థలం వైపు వస్తున్న ఆటో, రణస్థలం వైపు నుంచి కొండములగాం వైపు వెళుతున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో ఆటో ట్రాక్టర్ కిందకు వెళ్లిపోవడంతో ఆటోలో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. లావేరు మండలం వేణుగోపాలపురం గ్రామానికి చెందిన జి.రామినాయుడు, రణస్థలం గ్రామానికి అదపాక శిమ్మరావు, కొచ్చెర్లకు చెందిన కె.యల్లయ్య, తెప్పలవలసకు చెందిన ఆటో డ్రైవర్ కె.రామకృష్ణలను వివిధ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.